అందులో కొందరికి చేతివేళ్ళు లేవు. కొందరికి కాలివేళ్ళు లేవు. కొందరికి చెవుల్లేవు. కొందరికి పాదం సగంవరకు ఏమీలేదు. కొంద రికి అరచేతివరకు ఏమీలేదు....

భయంకరంగా వున్నారు.

ప్రకృతి, సమాజం శపించిన మనుషులు.... కుష్ఠువాళ్లు.

నాకు భయంవేసింది.

అవును- మెట్లు దిగుతుంటే నాకు భయంవేసింది.

నాక్కూడా ఏదో అవయవం లేదు. నిజమే- లేదు.

అవును- నిజమే-

నీకూ నాకూ గుండె లేదు....

— "స్వాతి" .... ?

# పిచ్చి

నేను జయబాబు అప్పుడే క్యాంటీన్‌లోంచి బైటికొస్తున్నాం. ఆమె వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమెకు ముప్ఫయ్యేళ్ళ వయస్సుంటుంది. ఎర్రగా నాజూగ్గా వుంది. కాశ్మీర్‌సిల్క్ చీర కట్టు కుంది. అదేరకం బ్లవుజ్ స్లీవ్‌లెస్ వేసుకుంది చేతిలో లేడీస్‌పర్స్— ఓ పుస్తకం వున్నాయి. ఫాషనబుల్‌గా ముడి చుట్టుకుంది. ముఖానికి కేక్ కాస్త ఎక్కువగా అద్దింది. పెదాలకు ఎర్రగా లిప్‌స్టిక్....

జయబాబు ఆమెవయిపే చూస్తున్నారు. ఆమె ఆఫీస్ పోర్టికోలో ఎవర్నో ఏదో అడిగింది. మేం చూస్తుండగానే మెట్లు ఎక్కి ఎష్టాబ్లిష్ మెంట్ సెక్షన్‌వైపు వెళ్ళింది.

'ఆవిడ నీకు తెల్సా?' జయబాబు నాకేసి తిరిగి అడిగాను.

'తెలియదు—'

'నీ కెక్కడా తగల్లేదా ?' మళ్ళీ అడిగాడు.

'లేదు- ఇంతకీ యెవరావిడసలు' ఏం అర్థంకాక అడిగాడు.

'ఓ- పిచ్చిమనిషి—'

కాదన్నట్టు చూశాను. అందులో చెప్పినవాడు జయబాబు—?

నిజమేరా- ఆమె ఎం.ఏ. ఇంగ్లీషు గోల్డు మెడలిస్టు'

అసలర్థం కావడంలేదు నాకు.

'అంటే ఎం.ఏ. ఇంగ్లీషు గోల్డు మెడలిస్టులంతా ఆటోమేటిక్‌గా పిచ్చివాళ్లా ?'

'కాదురా- ఆమెకు బ్రెయిన్స్ చెడిపోయాయి. శుద్ధ మెంటల్ కేసు- ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడుతుంది- కాని ఏం సంబంధం లేకుండా మాట్లాడుతుంది. ఓసారి నాకు అబిడ్స్‌లో తగిలింది- కాల్చుకు తినేసింది.'

'ఒరేయ్- ఈ వెధవ కబుర్లు నాకు చెప్పకు. దేశంలో ఆడాళ్ళందరిగూర్చి నీకు తెల్సన్నట్లు చెప్తావ్' దబాయించాను.

'ఆమె పిచ్చిదని పందెం- కావాలంటే బైటికొచ్చేక నేను పలకరిస్తాను. మాటాడుతుంది. కాని యేమిటేమిటో మాట్లాడుతుంది- మనం యే హోటల్‌కేనా, సినిమాకేనా వెళ్దామంటే చాలు. వెంటనే వచ్చేస్తుంది.'

'ఒరేయ్ వెధవ కోతలు కొయ్యకు- తెలుగు సినిమా కబుర్లు నువ్వూ—' వేళాకోళం పట్టించాను.

'పందెమా ?'

'ఒకవేళ పలకరిస్తే మాటాడుతుందేమో- సొసైటీ లేడీ అయ్యుండొచ్చు. అంతేకాని- పిలిస్తే సినిమాకొస్తుంది- హోటల్‌కొస్తుంది- ఈ కబుర్లన్నీ దేనికి ?'

'అదంతా ఎందుకు ? పందెమా ?' ఖచ్చితంగా అన్నాడు.

నాకు పౌరుషమొచ్చింది- జయబాబు చెప్పే విషయాల్లో నూటికి అరవయిపాళ్ళు నమ్మతక్కర్లేదని మా ఆఫీసులో సామెత.

'సరే- పందెం ?'

"ఎంత?" జేబులో డబ్బుతీసి అన్నాడు వాడు.

'పాతిక రూపాయలు' అన్నా నేను.

'ఓ కే'— చిర్నవ్వుతో అన్నాడు.

వాడు ఓడిపోతాడని నాకు చాలా నమ్మకంగా వుంది.

మేం ఇద్దరం మా ఆఫీసు గేటుముందు నిల్చున్నాం. ఓ అర గంట తర్వాత ఆమె బయటికొచ్చింది.

'హల్లో మేడమ్- హౌ ఆర్ యు?' అన్నాడు జయబాబు.

'ఫైన్— మిమ్మల్ని గుర్తుపట్టలేదు. కాని యెక్కడో చూసిన జ్ఞాపకం ఉంది—' అందామె ఇంగ్లీషులో.

'ఓసారి అబిడ్స్‌లో కలిశాం— నడుచుకుంటూ అన్నపూర్ణదాకా వెళ్ళి అక్కడ కాఫీ తాగాం- నా పేరు జయబాబు.'

'అవునవును జ్ఞాపకం వచ్చింది- ఆరోజు బిల్ నేనిస్తానంటే మీరు ఒప్పుకోలేదుకూడా—'

విజయగర్వంతో వాడి ముఖం వెలిగిపోయింది.

నా పాతిక రూపాయలికి కాళ్ళొస్తున్నట్లు ఫీలయ్యాను.

'ఆ బై దిబై — వీడు నా ఫ్రెండ్ రంగారావు నాతోటే పనిజేస్తున్నాడు.' అని నన్ను పరిచయం చేసాడు.

'హౌడుయుడు—' అని చెయ్యి చాపింది.

షేక్‌హాండ్ ఇచ్చాను.

'అన్నట్టేమిటి — ఇలా మా ఆఫీసులో కెళ్ళారు?' అడిగాడు జయబాబు.

'ఏమిటి మీరీ ఆఫీసేనా—ఐసీ— ఆ ఏంలేదు. మాకు తెల్సున్నతను ఒకాయన ప్రకాష్ అని ఇందులో పనిజేస్తున్నాడు. కలుద్దామని వచ్చాను—

'అలా వెళ్ళి కాఫీ తాగొద్దాం రండి' అన్నాడు జయబాబు.

నా పందెం పోడానికి ఆఖరి దశ.

అంతలో మరో అనుమానం వచ్చింది. ఆమె పిచ్చిది. కాఫీ కొస్తుందా లేక వీడి చెంప పగలగొడుతుందా ? — రెండోది జరగాలని నా కెక్కడో అన్పిస్తోంది.

'విత్ ప్లజర్ — కాని యిక్కడకాదు. సిద్దార్థ కెడదాం–ఐలైక్ దట్ హోటల్'.

జయబాబు నాకేసి గర్వంగా చూశాడు. ఆటో పిల్చాడు. ఆమె మా ఇద్దరి మధ్య కూర్చునుంది. ఆమె చేతులలో పుస్తకం తీసుకున్నాను హాగర్డ్ రాసిన క్లియోపాత్రా.

'వాట్ మిస్టర్ రంగా - మీరీ పుస్తకం చదివారా ?' అడిగింది.

లేదన్నాను.

'ఎ ఫంటాస్టిక్ బుక్ ఎబౌట్ ఎ ఫంటాస్టిక్ వుమన్— చరిత్రగతిని మార్చేసిన ఆడది— నేను చదివేసాను. మీరు తీసికెళ్ళి చదవండి—'

ఆమె ఎక్కువ ఇంగ్లీషులోనే మాట్లాడుతోంది.

'థాంక్స్' అన్నాను.

అట్ట తీసి చూశాను.

"మాలతి- ఎం. ఎ. (లిట్)" అని వుంది.

జయబాబు, ఆమె మాట్లాడుకుంటున్నారు.

అన్నట్టు మీరేంమాటాడ్డం లేదు మిస్టర్ రంగా!- మౌనంగా వుండ గలగటం నిజంగా వరమే- కాదనను. కాని యిలాంటప్పుడు కాదు.

నా భుజం మీద చెయ్యేసి అంది.

ఆమె నిజంగా పిచ్చిదేననిపించింది.

లేకపోతే అలా వాగడమేమిటి? ఎప్పుడో ఓసారి బస్టాండులో పరిచయమైన జయబాబు పిలిస్తే వెంటనే కాఫీకి రావడమేమిటి? మాఇద్దరి మధ్య ఆటోలో కూర్చోడమేమిటి? అలా భుజం మీద చెయ్యేసి మాటాడ్డమేమిటి?

వయస్సులో వున్న ఆడది యెందుకలా ప్రవర్తిస్తుంది.

మేం హోటల్ చేరుకునేదాకా ఏదో పిచ్చిగా మాట్లాడుతూనేవుంది.

ఆమెను రెస్టారెంట్‌లోకి వెళ్ళమని చెప్పి, నేను జయబాబు సిగరెట్ల కోసం బంక్ దగ్గర కెళ్లాం-అక్కడ నా బ్రాండ్ లేవు. బయటికొచ్చి రోడ్డు దాటి రీగల్ రెస్టారెంట్ దగ్గరున్న కిళ్ళీకొట్టు కెళ్ళాం.

"ఏమంటావ్‌రా- పందెం ఓడిపోయినట్టేనా?" గర్వంగా అన్నాడు జయబాబు.

జేబులోంచి రెండు పది నోట్లు, ఓ అయిదు నోటు తీసి వాడి చేతి కిచ్చాను. వాడు చిరునవ్వుతో వాటిని చేతులోకి తీసుకుని నా జేబులో కుక్కుతూ "ఒద్దులే- హోటల్ బిల్ యిచ్చెయ్యి-చాలు" అన్నాడు.

వాడిదగ్గర పందెం ఓడిపోయానని నాకు బాధలేదు.

మాలతి ప్రవర్తనే నాకు ఆశ్చర్యంగా ఉంది. కట్టులో గాని, నడకలోగాని, ప్రవర్తనలో గాని ఎక్కడా పిచ్చిలేదు. పిలవగానే హోటల్‌కొచ్చేసింది.

ఎవడేనా అది అలుసుగా తీసుకుంటే?

పిచ్చి ధైర్యమా?-

రెస్టారెంట్‌లో ఏర్‌కండిషనర్ వలన చల్లగా ఉంది. మాలతి కొంగు వొంటి నిండా కప్పుకుంది.

ఎన్నో కబుర్లు చెప్పింది.

షెల్లీ కవిత్వమంటే తన కిష్టమట. తెలుగులో ఒక్క కృష్ణశాస్త్రి అలా రాయగలరట! షేక్స్పియర్ తన కిష్టం లేదట. షా అంటే వల్లమాలిన అభిమానమట. తెలుగు సాహిత్యంలో ఎస్కేపిజం ఎక్కువై పోయిందట. మన దేశంలో నైతిక సూత్రాలు మారాలట.

ఏమిటేమిటో చెప్పింది.

'ఏదయినా పిక్చర్ కి వెడదామా ?' అన్నాడు జయబాబు.

"పిక్చర్ కా ?" ఓ క్షణం ఆలోచించింది.

'పెద్ద ఇంట్రస్టులేదు. ఇంగ్లీష్ పిక్చరైతే అభ్యంతరం లేదు—అన్నట్టు సంగీత్ లో "ది ఒమెన్" ఉంది—దానికయితే సిద్ధం—"

జయబాబు మీద నాక్కోపం వచ్చింది.

"సారీ నేను రాలేను..నాకు ఆఫీసులో వర్క్ వుంది"అన్నాన్నేను.

"మీ బాస్ కి ఫోన్ చేసి హాఫ్ డే సి. ఎల్, తీసుకోండి. మీరు రాకుండా ఎలా ?" చేతులు పట్టుకుని గారంగా అడిగింది మాలతి.

ఇదోరకం పిచ్చి?

హోటల్లో ఎవరయినా మమ్మల్ని చూస్తారేమోననిపించింది.

"అలాగే వస్తాన్లెండి" చేతులు తీసుకున్నాను.

హోటల్లోంచి బయటికొచ్చి ఆటో కోసం చూస్తున్నాను.

జయబాబు ఆఫీసుకి ఫోన్ చేసి మా లీవ్ విషయం చెప్పాడు.

ఆటో దొరికింది. పక్కకి చూస్తే మాలతి లేదు.

మేం అటూ ఇటూ కంగారుగా చూశాం—

రోడ్ ట్రాఫిక్ తో నిండిపోయింది.

తీరా చూస్తే రీగల్ రెస్టారెంట్ ముందు ఓ ముసలామె పడిపోయి వుంది. మాలతి ఆమె పక్కనే గొంతు కూర్చుని వుంది. మేం కూడా అక్కడికెళ్లాం.

మాలతి రీగల్ రెస్టారెంట్ లోకి వెళ్ళి రెండు గ్లాసులతో నీళ్ళు తెచ్చింది. ముసలామె ముఖం మీద నీళ్లు చల్లి తల పట్టుకుని మెల్లగా లేవదీసింది.

"మిస్టర్ జయ— ఓ టీ పట్రండి" అంది.

జయబాబు వెళ్ళి తెచ్చాడు.

నేను సాసర్‌లో పోస్తుంటే మాలతి ఆమెచేత టీ తాగించింది.

ముసలామె కళ్లు తెరిచింది.

"ఏం తల్లీ— యిలా పడిపోయావేం?" ఆప్యాయంగా అడిగింది మాలతి.

"ఆకలితో నీరసం వచ్చింది కళ్లు తిరిగాయి,"

ముసలామె యేడుస్తోంది.

"ఏడవకు తల్లీ!— నీ ఇల్లెక్కడ?"

"గాలిగూడ చెమన్‌తాన."

"రంగా— కాస్త ఆటోని పిలవండి" అంది.

పిల్చాను.

ముసలామెను ఆటోలో యెక్కించాం.

మాలతి ఆటోలో కూర్చుని ముసలామె తల తన వళ్లో పెట్టుకుంది.

"రంగా— మీరు థియేటర్ దగ్గర వెయిట్ చెయ్యండి–నేనీఅవ్వను వాళ్ళింటి దగ్గర దిగబెట్టి వచ్చేస్తాను. ఓకె డ్రైవర్ పోనీ!" అంది.

ఏం జరుగుతుందో తెలిసేలోగా ఆటో వెళ్ళిపోయింది.

ఓ ముసలామె రోడ్ పక్కన పడిపోయి ఉంటే జనమంతా తమ కెవరికి పట్టనట్టు హడావుడిగా వెళ్ళిపోతున్నారు.

ఏ మనిషికి తన పక్క మనిషి గురించి, తన పక్కన జరిగే సంఘటన గురించి స్పృహలేదు.

తన పక్క మనిషి గురించి. చుట్టూ జరిగే సంఘటనల గురించి స్పృహలేని వాళ్ళే పిచ్చివాళ్ళు.

అన్నట్టు చెప్పడం మరిచాను—

సిద్ధార రెస్టారెంట్‌లోకి మాలతిని పంపి నేను. జయబాబు సిగరెట్లకి రీగల్‌రెస్టారెంట్ దగ్గరి కెళ్ళేసరికే ఆ ముసలామె అక్కడ పడి వుంది.

మేం మా పందెం విషయం మాట్లాడుకున్నాం. కాని ముసలామె విషయం పట్టించుకోలేదు మాకూ స్పృహలేదు....

పిచ్చి ఎవరికి?

మాలతికా? మాకా? (ప్రభవ – 1979)